# హింస

**- అంపశయ్య నవీన్**



**"ముప్పయ్యేళ్ళొస్తున్నాయి. నువ్వు ఇంకెప్పుడు పెళ్ళి చేసుకుంటావురా...బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరారని పెద్దలు చెప్పారు" అన్నాడు ఆనందరావు బీరు గ్లాసు చేతిలోకి తీసుకొని "ఛీర్స్"అంటూ.**

"ఛీర్స్" అన్నాడు యుగంధర్ తనూ టేబుల్‌మీదున్న బీర్ గ్లాసును చేతిలోకి తీసుకొని.

"అవుట్ డేటెడ్ అయిపోయిన ఇలాంటి సామెతల్ని చెప్పకురా... నా పెళ్ళికొచ్చిన తొందరేమీలేదు" అన్నాడు యుగంధర్.

మిత్రులిద్దరూ ఓ బార్లో కూర్చొని బీర్ సేవిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నీ పెళ్ళికొచ్చిన తొందరేమీ లేదా! స్టుపిడ్! ముప్పయేళ్ళొచ్చాక కూడా పెళ్ళిచేసుకోకపోతే ఇంకెప్పుడు చేసుకుంటావురా! యే వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరిగితేనే అందం, ఆనందం" అన్నాడు ఆనందరావు.

'పెళ్ళి చేసుకోవడంలో అందం ఉందేమోకానీ ఆనందం మాత్రం లేదురా... ఈమధ్య పెళ్ళిచేసుకున్న వాళ్ళను చాలామందినే చూశాను. ఐదారు నెలలు తిరగకుండానే భార్యాభర్తలు శత్రువుల్లా పోట్లాడుకోవడం... భార్య పోలీసుస్టేషన్‌కెళ్ళి భర్తను గృహహింస కేసు కింద అరెస్టుచేయించి బ్లాక్‌మెయిల్ చెయ్యటం, అది విడాకులకు దారితీయటం... లేకపోతే భార్య నన్ను సరిగ్గా చూడటంలేదని, అనుక్షణం అవమానిస్తున్నదని భర్త ఆత్మహత్య చేసుకోవడం... ఇవన్నీ ఈరోజుల్లో చాలా మామూలైపోయాయి. పెళ్ళి చేసుకున్నవాళ్ళెవరూ సుఖంగా బతకటంలేదని నా దగ్గర చాలా రుజువులున్నాయి. ఎవరిదాకా ఎందుకు? నిన్నే తీసుకుందాం- పెళ్ళిచేసుకొని నువ్వేం సుఖపడ్తున్నావురా? మీ ఇంటికెప్పుడొచ్చినా నీ భార్య నువ్వూ పోట్లాడుకుంటూనే ఉంటారు. ఆమె మీ చెల్లెల్నో, మీ అమ్మనో యేదో అంటుంది, నువ్వు వాళ్ళ అమ్మనో చెల్లెల్నో, అక్కనో యేదో అంటావు. దాంతో ఆమె రెచ్చిపోతుంది. ఆమె నీ సంపాదననూ, నీ అలవాట్లను వెక్కిరిస్తూ మాట్లాడుతుంది. నువ్వో తాగుబోతువంటుంది, నీకు కనీస సంస్కారం లేదంటుంది. దాంతో నువ్వామె చెంప చెళ్లుమనిపిస్తావు... ఆమె నన్ను కొట్టేంతవరకు వెళ్ళావా అని శోకాలు పెడ్తుంది. పోలీసుస్టేషన్‌కు వెళ్ళి నీమీద కేసు పెడ్తానంటుంది. నిన్ను లాకప్‌లో వేయించి తన్నిస్తానంటుంది. నువ్వు భయపడిపోయి 'సారీ' చెప్పి ఆమెను ఓదార్చటానికి ప్రయత్నిస్తావు... మీ ఇంట్లో రోజూ జరిగేది ఇదే కదా" అన్నాడు యుగంధర్.

"నిజమే అనుకో... పెళ్ళైన కొత్తలో మేం బాగానే ఉండేవాళ్ళం. కానీ క్రమంగా ఆవిడకు నేను చేసే కొన్ని పనులమీద అసంతృప్తి బయల్దేరింది. ఎప్పుడో ఒకసారి నీలాంటి ఫ్రెండ్‌తో కొంచెం తాగొస్తే దాన్నో పెద్ద ఇష్యూ చెయ్యడం మొదలెట్టింది. అలాగే నేను మా అమ్మను ప్రేమగా చూసుకుంటే "ఈయనకు అమ్మ తప్ప భార్య అక్కర్లేదు" అనడం మొదలెట్టింది. నేను ఎక్కువ సంపాదించటం లేదని, మా పిల్లల్ని పెద్ద మొత్తంలో డొనేషన్లు చెల్లించి రెప్యూటెడ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో చేర్పించలేదని... ఇలా ఆమెకు నామీద చాలా కంప్లెయింట్స్ ఉన్నాయనుకో... కానీ ఇవన్నీ త్వరలోనే సర్దుకుంటాయి... కాస్సేపు పోట్లాడుకున్నా తర్వాత బాగానే ఉంటాం... రోజూ ఆమె నాకు చాలా సుఖాన్నిస్తుంది. ఆమెకు నేనూ యేది కావాలంటే అది కొనిస్తుంటాను. అలా ఆమె అవసరం నాకు, నా అవసరం ఆమెకూ ఉన్నప్పుడు ఎలాగోలా కలిసుండటం తప్పదు కదా!" అన్నాడు ఆనందరావు.

"భార్యాభర్తలన్నప్పుడు ఒకర్నొకరు అర్థంచేసుకొని, గౌరవించుకుంటూ హాయిగా కాపురం చెయ్యాలేగానీ ఎలాగోలా ఈ బాధ తప్పదన్నట్టుగా కలిసుండటం యేమిత్రా? అలాంటి కాపురాన్ని నేను కోరుకోవడం లేదు. అసలు మన వివాహ వ్యవస్థలోనే పెద్ద లోపముందిరా... భార్య అనగానే భర్తకు, భర్త అనగానే భార్యకు ఒక రకమైన చులకన భావం యేర్పడుతుంది. ఒకర్నొకరు కొనుక్కున్న వస్తువులా చూస్తారు. భార్య నా ప్రతి అవసరాన్ని తీర్చాలని భర్త అనుకుంటాడు. భార్యంటే కార్యేషు దాసి, శయనేషు రంభ, భోజ్యేషు మాత అని మన పూర్వులే ఒక బలమైన అభిప్రాయాన్ని భర్తల్లో నాటిపోయారుగా... ఆ అభిప్రాయానికి తగ్గట్టుగా భార్య ఉండాలని భర్త ఆశిస్తాడు. అలా ఉండకపోతే భార్యను ద్వేషించటం మొదలెడ్తాడు. అలాగే భార్య భర్త పూర్తిగా తనకే చెందాలనుకుంటుంది. భర్తమీద తనకే అధికారం ఉందనుకుంటుంది. భర్త ప్రతి విషయంలోనూ తనకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటుంది. ముఖ్యంగా భర్త తన కంటె అతని తల్లికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్టుగా అనుమానమొస్తే చాలు, భార్య ఆ భర్తను ద్వేషించటం మొదలెడ్తుంది. భర్త ఎప్పుడూ తన తరఫువాళ్ళకే ప్రాముఖ్యం ఇవ్వాలనుకుంటుంది. భర్త తరఫువాళ్ళను శత్రువులనుకుంటుంది. భార్యకున్న ఈ అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకోని భర్తతో భార్య పోట్లాడటం మొదలెడ్తుంది. రాత్రి బెడ్‌రూంలో భార్య ఇచ్చే సుఖంకోసం భర్త భార్యతో ఇలాంటి చాలా విషయాల్లో తన అంతరాత్మను చంపుకొని కాంప్రమైజ్ అవుతుంటాడు. అలా కాంప్రమైజ్ కాని భర్తలకు భార్యలు నరకాన్ని చూపిస్తారు. అందుకే పెళ్ళిచేసుకున్న మరుక్షణం నుండి నువ్వు నీ స్వేచ్ఛను, నీ స్వాతంత్ర్యాన్ని కోల్పోతావు. నీ అంతరాత్మను చంపుకొని అనుక్షణం కాంప్రమైజ్ అవుతుంటావు. అందుకే నేను పెళ్ళిచేసుకోవద్దని గట్టిగా నిర్ణయించుకొన్నాను" అన్నాడు యుగంధర్ తన గ్లాసులో ఉన్న బీరును ఒక్క గుక్కలో తాగేసి.

ఇద్దరూ ఖాళీ అయిన గ్లాసుల్ని నింపుకొని సిగరెట్లు వెలిగించుకున్నారు.

"రేపు పెళ్ళయితే నేనిలా బార్‌లో కూర్చొని బీరు తాగుతూ సిగరెట్ వెలిగించుకొని స్మోకింగ్‌లో ఉన్న ప్లెజర్‌ని అనుభవించగలవా? బీర్ తాగుతూ సిగరెట్ పీల్చడం అంటే నాకెంత ఇష్టమో నీకు తెలుసుకదరా! భార్య రాగానే నాతో బీర్ త్రాగడం మానెయ్యాలంటుంది. సిగరెట్ తాగితే నా దగ్గరకు రావొద్దంటుంది. ఇలా ఇంకెన్నో ఆంక్షలుపెట్టి నన్ను అనుక్షణం వేధిస్తుంటుంది" అన్నాడు యుగంధర్.

"అందరూ మా ఆవిడలాగే ఉంటారని ఎందుకనుకుంటున్నావురా! నీకు మంచి భార్యే దొరకొచ్చు... మనసున మనసై. బతుకున బతుకై తోడొకరుండిన అదే భాగ్యమో అన్నట్టు అలాంటి భాగ్యం నీకు లభించొచ్చురా..."అన్నాడు ఆనందరావు.

"ఈ గ్లోబలైజేషన్ రోజుల్లో అలాంటి భార్యలు లభించే రోజులు పోయాయి లేరా! ఇప్పటి ఆడవాళ్ళు చాలా తెలివిమీరిపోయారు. పెళ్ళైన మరుక్షణంనుండి భర్తల్ని తమ గుప్పిట్లో ఎలా ఉంచుకోవాలో వాళ్ళకు బాగా తెలిసిపోయింది. భార్యకు భర్త, భర్తకు భార్య అన్నీ దశల్లోకూడా తోడునీడగా ఉండాలన్న పూర్వపు విలువలు గ్లోబలైజేషన్ తాకిడికి హరించిపోతున్నాయి. పూర్వ భర్తలు భార్యల్ని తమ అదుపులో ఉంచుకుంటూ తాము చెప్పినట్టు వినేలా చేసేవారు. కానీ ఇప్పుడు భార్యలే భర్తల్ని తమ అదుపులో ఉంచుకుంటున్నారు. తాము చెప్పినట్టు వినాలని భర్తల్ని శాసిస్తున్నారు."

"అయితే నువ్వసలు పెళ్ళేచేసుకోవా? అన్నివిధాలా నీకు తగిన భార్య దొరుకుతుందనుకో... అప్పుడు కూడా చేసుకోవా?"

"చెప్పలేను... అయినా నేను పెళ్ళిచేసుకోకపోతే ఈ సమాజం ఊరుకుంటుందా? మనలాగా వీడు పెళ్ళిచేసుకొని సంసార జంఝాటంలో పడిపోయి ఎప్పుడూ యేడుస్తూ కూర్చోక హాయిగా ఉండిపోయాడేమిటని సమాజం నాలాంటి వాడిమీద పగబడ్తుంది. ఈ సమాజమనేది అందరూ తను విధించిన కొన్ని నియమాలను పాటించి తీరాలని పట్టుబడ్తుంది...ఇప్పుడు నువ్వే ఉన్నావు... నన్ను పెళ్ళిచేసుకోమంటున్నావు... నువ్వెవరివి? ఈ సమాజానికి ప్రతినిధివి. నా మెడలు వంచి సమాజం విధించిన నియమాలను పాటించేలా చేసే సమాజానివి. సమాజం నామానాన నన్ను బతకనివ్వదుగా" అన్నాడు యుగంధర్.

"నువ్వేమన్నా చెప్పు... కొన్ని సమస్యలున్నా పెళ్ళి అనేది అవసరమే... సమాజానికీ అవసరమే... వ్యక్తికీ అవసరమే... పెళ్ళి అనే వ్యవస్థ అంతరించిపోతే సమాజంలో స్థిరత్వం ఉండదు... వ్యక్తులకొక క్రమశిక్షణ ఉండదు... అంతా అస్తవ్యస్తంగా మారిపోతుంది"అన్నాడు ఆనందరావు.

ఇద్దరూ తాగటం, తినడం ముగించి బిల్లు చెల్లించి బార్లోంచి బయటకొచ్చారు.

* * *

ఐదారు నెలల తర్వాత పెళ్ళిచేసుకోవాలని యుగంధర్‌ను అతని తల్లిదండ్రులు అతనిమీద తీవ్రమైన వొత్తిడి తెచ్చారు.

"నువ్వు వెంటనే పెళ్ళిచేసుకోకపోతే నేను ఉరేసుకొని చచ్చిపోతాను" అంది వాళ్ళమ్మ. ఆమాట విని యుగంధర్ నవ్వి ఊరుకున్నాడు. కానీ ఒకరోజు యుగంధర్ వాళ్ళమ్మ నిజంగానే ఉరేసుకోవటానికి ప్రయత్నించింది. సమయానికి యుంగధర్ వాళ్ళ నాన్న ఆమెను వారించి కాపాడగల్గాడు.

ఆ సంఘటన తర్వాత యుగంధర్‌కు పెళ్ళిచేసుకోవటానికి ఒప్పుకోక తప్పలేదు.

ఓ మంచి సంబంధం ఉందని, అమ్మాయికి అందం, అణకువ ఉన్నాయని, వెంటనే నువ్వాఅమ్మాయిని చూడాలని వాళ్లమ్మ చెప్పింది. యుగంధర్ వెళ్ళి ఆ అమ్మాయిని చూశాడు.

చూడటానికి ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. బి.టెక్ చదివానని, త్వరలోనే ఆమెకు ఉద్యోగం దొరుకుతుందని ఆ అమ్మాయివాళ్ళ నాన్న చెప్పాడు.

"అమ్మాయితో నేను వంటరిగా కాస్సేపు మాట్లాడాలి" అన్నాడు యుగంధర్.

"సరే"అన్నారు ఆ అమ్మాయి అమ్మానాన్నలు.

ఆ అమ్మాయి పేరు సునీత. సునీత, యుగంధర్‌లు ఓ రూంలో కూర్చొని చాలాసేపు మాట్లాడుకున్నారు.

"సునీతగారూ! నాకు పెద్ద ఉద్యోగం లేదు. ఓ చిట్ ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నారు. నెలకు పదివేలు నా జీతం" అన్నాడు యుగంధర్.

"ఫరవాలేదు. రేపు నాకూ ఓ ఉద్యోగం దొరుకుతుంది. ఇద్దరి సంపాదనతో మనం హాయిగా బతకొచ్చు" అంది సునీత.

"నాకు బీర్ తాగే అలవాటుంది" అన్నాడు యుగంధర్.

"రోజూ తాగుతారా? ఎప్పుడో ఒకసారా?"

"రోజూ తాగను... ఎప్పుడైనా ఫ్రెండ్స్‌తో సరదాగా తాగుతాను."

"అలా అయితే అభ్యంతరం లేదు."

"నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు... నో ప్రాబ్లెమ్."

"మా అమ్మానాన్నలు అరవై పైబడినవాళ్ళు. వాళ్ళు మనతోటే ఉంటారు."

"నో ప్రాబ్లెమ్."

"నాకు మా అమ్మానాన్నలంటే చాలా ప్రేమ."

"నో ప్రాబ్లెమ్... నాకూ మా అమ్మానాన్నలంటే చాలా ప్రేమ.."

"నాకు ఇద్దరు చెల్లెళ్లుకూడా ఉన్నారు. వాళ్ళను చదివించి పెళ్ళిచేసే బాధ్యత నాదే..."

"నో ప్రాబ్లెమ్... నాకూ ఇద్దరు చెల్లెళ్లున్నారు... చెల్లెళ్ళను ప్రేమగా చూసుకోవడంలో తప్పులేదు... నేను అర్థం చేసుకోగలను."

"కొన్ని విషయాల్లో మీ స్వేచ్ఛను నేను గౌరవిస్తాను. నా స్వేచ్ఛను మీరు గౌరవించాలి. మనమెప్పుడూ పోట్లాడుకోకుండా ఒకర్నొకరం గౌరవించుకుంటూ ప్రేమగా కాపురం చెయ్యాలి. మీవాళ్ళు మావాళ్ళు అనే తేడాలుండొద్దు. చిన్నచిన్న అభిప్రాయ బేధాల్ని పెద్దవి చేసుకోవద్దు. దేన్నీ మనసులో పెట్టుకుని సాధించొద్దు. ఓపెన్‌గా ఉండాలి."

> "నువ్వేమన్నా చెప్పు... కొన్ని సమస్యలున్నా పెళ్ళి అనేది అవసరమే... సమాజానికీ అవసరమే... వ్యక్తికీ అవసరమే... పెళ్ళి అనే వ్యవస్థ అంతరించిపోతే సమాజంలో స్థిరత్వం ఉండదు... వ్యక్తులకొక క్రమశిక్షణ ఉండదు... అంతా అస్తవ్యస్తంగా మారిపోతుంది"

"అలాగే... అలాగే"

ఇలా వాళ్ళిద్దరు రెండుమూడుసార్లు కలుసుకొని చాలా విషయాలు మాట్లాడుకున్న తర్వాతే వాళ్ళ పెళ్ళి వైభవంగా జరిగింది.

"కంగ్రాట్స్‌రా! నీ పెళ్ళి నీ ఇష్టప్రకారమే జరిగింది. నీ కండీషన్స్‌కన్నిటికీ ఒప్పుకున్న భార్య దొరికింది. నీ పెళ్ళి తప్పకుండా విజయవంతమౌతుంది" అన్నాడు ఆనందరావు.

* * *

ఆరునెలలు గడిచిపోయాయి.

ఒకరోజు ఆనందరావు యుగంధర్‌ను కలిసి చాలారోజులయిందని... వాళ్ళెలా ఉన్నారో చూద్దామని యుగంధర్ ఇంటికొచ్చారు.

యుగంధర్ ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయి. ఆనందరావు డ్రాయింగ్‌రూంలో ప్రవేశించగానే లోపల్నుండి యుగంధర్ సునీతల మాటలు అతనికి వినిపించాయి.

"రాత్రి మీరు తాగొచ్చారు. అర్ధరాత్రిదాకా ఇంటికి రాకపోతే, ఫ్రెండ్స్‌తో తాగుతూ బార్లో కూర్చుంటే ఇంట్లో ఇదొక్కతే యేమైపోతుందో ఆలోచించారా?" అంది సునీత కంఠం.

"రాత్రి నేను తాగిరాలేదు... ఇదివరకు అప్పుడప్పుడు ఫ్రెండ్స్‌తో తాగేవాడిని. ఇప్పుడు నీ సాధింపును భరించలేక అది కూడా మానేశాను" ఇది యుగంధర్ కంఠం.

"అబద్దాలు చెప్పొద్దు. కట్టుకథలు చెప్పి నా నోరు మూయించొద్దు."

"కట్టుకథలు చెప్పాల్సిన అవసరం నాకు లేదు. రాత్రి ఓ మోటారు సైకిల్ యాక్సిడెంట్‌లో నా ఫ్రెండ్ శ్రీనివాసరావు కాలు విరిగిపోతే అతన్ని హాస్పిటల్లో చేర్పించి వచ్చే టప్పటికి చాలా ఆలస్యమైపోయింది."

"ఆ విషయం నాకు ఫోన్‌చేసి చెప్పొచ్చుగా?"

"టైమ్ లేకపోయింది. అయినా ఆలస్యంగా వచ్చినంత మాత్రాన నేను తాగొచ్చానని నువ్వనడం చాలా అన్యాయం. ఇది నన్ను అవమానించడమే..."

"మీరు నన్నెన్ని రకాలుగా అవమానిస్తున్నారో ఆలోచించారా? కాస్సేపు బజారుకెళ్ళొస్తే ఎక్కడికెళ్ళావని యక్షప్రశ్నలు వేస్తారు. నేను ఎవడితోనో తిరిగొచ్చానని మీకు అనుమానం. నేను అనుక్షణం ఈ నాలుగ్గోడల మధ్య ఉండి మీకు, మీ అమ్మానాన్నలకు సేవచేస్తుండాలని అనుకుంటారు. నేను మా అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళొద్దు. మీరు మాత్రం మీ ఫ్రెండ్స్‌తో తిరగొచ్చు. బార్లలో కూర్చొని తాగొచ్చు... మీకొచ్చే ఆ కాస్త సంపాదనని ఇష్టమొచ్చినట్టుగా ఖర్చుపెట్టడం... నేనేదన్నా కొనుక్కుంటానంటే డబ్బుల్లేవని విసుక్కోవడం. నా కర్మ కొద్దీ దొరికారు... ఓ తాగుబోతు..."

"షటప్ యువర్ బ్లడీ మౌత్! నేను తాగడం మానేశానంటే నమ్మవేం."

"అబద్ధం...మీరు తాగడం మానెయ్యలేదు..."

"అబద్దాలు చెప్పడం నీకలవాటు. పెళ్ళికిముందు "బీ.టెక్ ప్యాసయ్యాను... త్వరలోనే ఉద్యోగం దొరుకుతుంది" అన్నావు... నువ్వు బి.టెక్. ప్యాసుకాలేదని, కనీసం బి.ఏ. కూడా ప్యాసు కాలేదని తర్వాత నువ్వే ఒప్పుకున్నావు. పెళ్ళికి ముందే నా సంపాదన ఎంతో చెప్పాను. 'నో ప్రాబ్లెమ్' అన్నావు. ఇప్పుడేమో అనుక్షణం నా సంపాదనను వెక్కిరిస్తున్నావు... మీ సంపాదనంతా మీ అమ్మానాన్నల వైద్యానికే సరిపోతుందంటున్నావు... నాకెప్పుడైనా యేదైనా ఓ చీర కొనిచ్చిన పాపానపోయారా అంటున్నావు... ఛీఛీ... ఆడ జాతంటేనే అసహ్యం పుడ్తోంది... ఇది ఇల్లుకాదు, నరకం. ఈ నరకం నుండి నాకెలా విముక్తి లభిస్తుందో అర్థంకావడంలేదు."

"నా పీక నులిమి చంపెయ్యండి. అప్పుడుగాని మీకు విముక్తి దొరకదు. రండి. నన్ను చంపెయ్యండి... నా తలను వెయ్యి వొక్కలు చెయ్యండి" అంటూనే ఆమె తన తలను గోడకేసి బాదుకోసాగింది.

బయట్నుంచి వాళ్ళ మాటలు వింటున్న ఆనందరావు వెంటనే వాళ్ళున్న వాళ్ళ బెడ్‌రూంలోకెళ్ళి ఆమెను ఆపాడు. అప్పటికే ఆమె తలకు గాయమై రక్తం కారసాగింది.

* * *

త్వరలోనే ఆనందరావు ఒక షాకింగ్ వార్త విన్నాడు. సునీత, యుగంధర్‌లు విడిపోయారని, ఆమె అతని మీద గృహహింస చట్టం కింద పోలీసు కేసు పెట్టిందని, అతన్ని పోలీసులు అరెస్ట్‌చేసి బెయిల్ మీద వదిలేశారని విన్నప్పుడు ఆనందరావు "హాయిగా ఉంటున్నవాడిని ఈ రొంపిలోకి మేమే ఈడ్చామేమో" అనుకున్నాడు. యుగంధర్ విడాకులు కావాలని అడిగాడని, మ్యూచువల్ కాన్సెంట్‌తో విడాకులివ్వడానికి సునీత అతన్నుండి పది లక్షలు డిమాండ్ చేసిందని కూడా ఆనందరావుకు తెలిసింది. "చివరకు మా నాన్నకున్న సొంతిల్లు అమ్మేసి" ఐదు లక్షలిచ్చి సునీతను వదిలించుకున్నానని యుగంధర్ ఆనందరావుకు చెప్పాడు. ★


రచయిత చిరునామా

డా. అంపశయ్య నవీన్

ఇ.నెం.2-7-71, ఎక్సైజ్ కాలనీ, సుబేదారి,

హనుమకొండ- వరంగల్- 506001